సాక్షి రంగారెడ్డి

శుక్రవారం : 24 : జనవరి : 2025



అభివృద్ధి లోగిలి

చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో ఏర్పడిన తొలి మున్సిపల్ అయినప్పటికీ అభివృద్ధిలో మాత్రం అందలమెక్కింది.

10లో ▸



వ్యసనాలకు బానిసలవ్వొద్దు

యువత వ్యసనాలకు బానిసలవ్వొద్దని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి పొన్న శ్రీదేవి అన్నారు.

10లో ▸



ఐక్యతకు ప్రతీక ఉర్సు

కులమతాలకు అతీతంగా ఉర్సు ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు.

10లో ▸

న్యూస్‌రీల్

అభివృద్ధికి పాలకవర్గ సభ్యుల కృషి భేష్



పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ అభివృద్ధికి పాలక వర్గ సభ్యులు ఐదేళ్లుగా నిరంతరం కృషి చేశారని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన చివరి పాలకవర్గ సర్వసభ్య సమావేశానికి ఆయన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం మున్సిపాలిటీలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. కొత్త మున్సిపాలిటీ అయినప్పటికీ పాలకవర్గ సభ్యులు అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పాలక వర్గ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులను సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రకాశ్ గుప్తా, ప్రవీణ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్‌గా డాక్టర్ సతీష్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్‌గా డాక్టర్ సతీష్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన డాక్టర్ నరేష్ పదోన్నతి పొంది రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ హెడ్ ఆఫీసుకు బదిలీ అయ్యారు. పదోన్నతిపై వెళ్లిన డాక్టర్ నరేష్‌కు వీడ్కోలు పలుకుతూ, బదిలీపై వచ్చిన డాక్టర్ సతీష్‌రెడ్డికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ ప్రమోద్, ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మహేందర్, టీమ్ లీడర్లు రమేష్, ఉపేందర్, నజీర్, రమణ, ప్రసాద్, హరికిషన్, వీరేశం పాల్గొన్నారు.

పోలీసు పహారాలో గ్రామసభ




గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడులో గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించడానికి ముందు కొంత మంది భూ బాధితులను పోలీసులు అడ్డుకున్నారు. ఇళ్ల వద్దకే వెళ్లి హౌస్ అరెస్టు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాల్లో అర్హుల పేర్లు లేవని, అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని ప్రజలు నిలదీశారు. చనిపోయిన వారి పేర్లు జాబితాలో ఉండడంపై విస్మయం వ్యక్తం చేశారు. రేషన్‌కార్డుల విషయంలో ఎక్కడా మీ సేవలో దరఖాస్తు చేసుకున్న రాలేదని , కాంగ్రెస్ వాళ్లకే వచ్చాయని బీఆర్‌ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వాగ్వాదం మొదలైంది. ఈ జాబితా ఫైనల్ కాదని, అభ్యంతరాలుంటే తొలగిస్తామని డీటీ శ్రీనివాస్ నచ్చజెప్పారు. అర్హులందరికీ పథకాలు వర్తిస్తాయని హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ స్థాయి అధికారులు ఇద్దరు, సీఐ, నలుగురు ఎస్‌ఐలు, 20 మందికి పైగా పోలీసులు, ఇంటలిజెన్స్, ఎస్‌బీ అధికారులు అక్కడే మోహరించారు.

30న బల్దియా పాలకమండలి సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం, అనంతరం సాధారణ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 1న నిర్వహించనున్నట్లు ఇప్పటికే సభ్యులకు సమాచారం పంపిన అధికార యంత్రాంగం.. తేదీ మారినట్లు ప్రకటించింది. ఈ నెల 31 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్నందున జనవరి ఈనెల 30న సమావేశాలు జరగనున్నట్లు జీహెచ్‌ఎంసీ సెక్రటరీ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్తంభాలు ఎక్కలేరు.. దిగలేరు



ఫిట్‘లెస్’మెన్లు!

- మెజార్టీ లైన్‌మెన్లది ఇదే పరిస్థితి
- నిరుద్యోగులను అసిస్టెంట్లుగా నియమించుకుంటున్న వైనం
- ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్న కార్మికులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: విధి నిర్వహణలో ఫిట్‌గా ఉండాల్సిన లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్టిజన్, ఫోర్‌మెన్లు అన్‌ఫిట్‌గా మారుతున్నారు. స్వయంగా స్తంభాలను ఎక్కి దిగలేక పోతున్నారు. వయసు రీత్యా కొంత మంది ఎక్కిదిగలేక పోతుండగా.. రోజువారీ ప్రాక్టీస్ లేక మరికొంత మంది దూరంగా ఉంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నిరుద్యోగులను అసిస్టెంట్లుగా నియమించుకుని గుట్టుగా వారితో పనులు చేయిస్తున్నారు. ప్రమాదవశాత్త మృతి చెందితే తమకు సంబంధం లేదని చెప్పి తప్పించుకుంటున్నారు. బాలాజీనగర్ సబ్‌స్టేషన్‌లోని ఓ జేఎల్‌ఎం కింద అసిస్టెంట్‌గా పనికి చేరిన ఖమ్మం జిల్లాకు చెందిన బానోతు ప్రశాంత్ (26) స్తంభంపైకి చేరుకుని వైర్ కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గాజులరామారం చౌరస్తాలో ఇటీవల విద్యుత్ స్తంభాలపైకి చేరుకుని వైర్లు లాగే క్రమంలో ఇద్దరు కార్మికులు షాక్‌కు గురయ్యారు. వీరిలో అనిల్ అనే కార్మికుడు స్తంభంపై నుంచి పడి చనిపోగా, మహేశ్ అనే కార్మికుడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చేరాడు. డిస్కం పరిధిలో తరచూ ఇలాంటి ఘటనలు వెలుగు చూ స్తున్నా బాధ్యులైన రెగ్యులర్ లైన్‌మెన్లపై ఇప్పటి వరకు చర్యలు తీసుకుంది లేదు. కనీసం ఉన్నతాధికారుల పంచనామాలో వారి పేరు కూడా కన్పించకపోవడం గమనార్హం.

ప్రాణాలను ఫణంగా పెడుతూ..

ఇతర ప్రభుత్వ విభాగాల్లో పని చేసే ఉద్యోగుల విధులతో పోలిస్తే విద్యుత్ సంస్థల్లో విధి నిర్వహణ కొంత ప్రమాదకరం. రిస్క్ ఎక్కువ ఉంటుంది కాబట్టే రెగ్యులర్ ఉద్యోగులకు డిస్కం వేతనం కూడా బాగానే చెల్లిస్తుంది. వేతనంతో కూడిన సెలవులు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అన్‌లిమిటెడ్ వైద్యసేవలు పొందే అవకాశం, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురై చనిపోయినా, అంగవైకల్యం బారినపడిన వారికి పెద్ద మొత్తంలో పరిహారం చెల్లిస్తుంది. కుటుంబ సభ్యుల్లో ఒకరికి సంస్థలో ఉద్యోగావకాశం కల్పిస్తుంది. జేఎల్‌ఎంలకు అసిస్టెంట్లుగా, విలేజ్ హెల్పర్లుగా చెప్పుకొంటున్న వారికి ఎలాంటి బెనిఫిట్స్ వర్తించవు. భవిష్యత్తులో పర్మినెంట్ అవుతుందనే ఆశతో చాలామంది నిరుద్యోగులు వీరి కింద అసిస్టెంట్లుగా పని చేసేందుకు అంగీకరిస్తున్నారు. ప్రాణాలు ఫణంగా పెట్టి పని చేస్తున్నారు. ముఖ్యంగా సైబర్‌సిటీ, కొండాపూర్, ఇబ్రహీంబాగ్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, చంపాపేట, ఇబ్రహీంపట్నం, కందుకూరు, షాద్‌నగర్, కూకట్‌పల్లి, మేడ్చల్ డివిజన్ల పరిధిలో పని చేస్తున్న రెగ్యులర్ జేఎల్‌ఎంలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్టిజన్లు, ఫోర్‌మెన్లు ఈ తరహా వ్యవహారాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగం సిబ్బంది పనితీరును పరిశీలించాల్సిన ఏఈ, ఏడీఈ, డీఈలు ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదు.

పంచనామాల్లోనూ కన్పించని పేర్లు

జూనియర్ లైన్‌మెన్‌కు పోస్టింగ్ వచ్చిన కొత్తలో నెలవారి జీతం రూ.40 వేల వరకు ఉంటుంది. సీనియార్టీని బట్టి రూ.1.50 లక్షలకుపైగా తీసుకుంటున్నారు. వీరు ఉద్యోగంలో జాయిన్ అయిన తర్వాత సెక్షన్ ఆఫీసులో పోల్ ఎక్కే విధానం లేకుండా పోయింది. మీటర్ రీడింగ్, డిస్ కనెక్షన్ (డిలిస్ట్) సర్వీసులకే పరిమితం అవుతున్నారు. రోజువారీ ప్రాక్టీస్ లేకపోవడంతో మెజార్టీ జేఎల్‌ఎంలు పోల్స్ ఎక్కడం మానేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తులతో పని చేయిస్తున్నారు. సంస్థ ఉద్యోగులు చేయాల్సిన పనులను రోజువారీ కూలీలతో చేయిస్తున్నారు. విద్యుత్ లైన్లు, సరఫరా వ్యవస్థపై వారికి సరైన అవగాహన లేక షాక్‌కు గురై మృత్యువాతపడుతున్నారు. ఎల్సీలు తీసుకున్నప్పటికీ ఇంట్లోని ఇన్వెర్టర్లు, జనరేటర్ల నుంచి లైన్‌కు కరెంట్ పాస్ అవుతోంది. విద్యుత్ ప్రమాదాలపై ఏడీఈ, డీఈ ఇచ్చే ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి వస్తోంది. ప్రైవేటు కార్మికులతో పని చేయించినట్లు ధ్రువీకరిస్తే..రెగ్యులర్ ఉద్యోగికి ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో ఆ విషయాన్ని దాచిపెట్టి, మృతుల బంధువులతో బేరసారాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. వీరంతా ఇతర ప్రాంతాల నుంచి పొట్ట చేతపట్టుకుని బతుకుదెరువు కోసం వచ్చిన వారు కావడంతో చేసేది లేక ఇచ్చింది తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ విషయం యాజమాన్యానికి తెలిసీ ఇప్పటి వరకు ఏ ఒక్కరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఆదిబట్లలో రతన్ టాటా విగ్రహం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

- ముఖ్యమంత్రి రాగానే స్థల ఎంపిక
- కాంగ్రెస్ అంటేనే ప్రజా సంక్షేమం
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లలో రతన్ టాటా విగ్రహం ఏర్పాటు చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వార్డు సభలో మంత్రి మాట్లాడారు. దేశంలో తన సంపదలో సగానికిపైగా ప్రజల కోసం పంచిన దానశీలుడు రతన్ టాటా అని కొనియాడారు. వారి కంపెనీలు ఈ ప్రాంతంలో వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్నాయని గుర్తుచేశారు. ఆయన సేవాదృక్పథానికి గుర్తుగా ఆదిబట్లలో రతన్ టాటా విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి దావోస్ పర్యటన నుంచి వచ్చాక చర్చించి విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేస్తామన్నారు. కాంగ్రెస్ అంటేనే ప్రజా సంక్షేమమని తెలిపారు. రాబోయే పదిహేను రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల రేషన్‌కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్‌కార్డు, ఇల్లు మంజూరు చేయలేదని విమర్శించారు. ఫాంహౌస్‌లో చర్చించుకొని ఎమ్మెల్యేల చేతులకు పగ్గాలు ఇచ్చినట్లు కాదని, తమ ప్రభుత్వం సభల్లోనే ప్రజల మధ్య చర్చించి లబ్ధిదారులను ఎంపిక చేస్తుందని స్పష్టం చేశారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఔటర్‌రింగ్‌రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటయ్యాయని, ఆదిబట్లలో టీసీఎస్, ఏరోస్పేస్ లాంటి సంస్థలు ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చారని గుర్తు చేశారు. మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే ట్రిపుల్ ఆర్ తీసుకొస్తున్నామని రూ.30 వేల కోట్లతో పనులు ప్రారంభం కాబోతున్నట్లు వెల్లడించారు. రూ.200 కోట్లతో 200 ఎకరాల్లో కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణం కోసం ఇటీవలే మంత్రివర్గం తీర్మానం చేసిందన్నారు. గురునానక్ కళాశాల నుంచి మాల్ వరకు నాలుగు లేన్ల రోడ్డు వేసి ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని, విజయవాడ హైవే మాదిరి సాగర్ హైవేను అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చెప్పినట్లుగా ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేన్నారు. పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలుక మధుసూదన్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు అర్చన, లావణ్య, మౌనిక, మహేందర్, హరిదాసు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఆ పార్టీలను నమ్మే పరిస్థితి లేదు

- బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసింది
- హామీల అమలులో కాంగ్రెస్ అభాసుపాలు
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో పెట్టిందని, ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక అభాసుపాలు అవుతోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం ఇటీవల నూతనంగా ఎన్నికైన బూత్‌స్థాయి అధ్యక్షులు, మండల అధ్యక్షుల సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, కేంద్రం నుంచి వచ్చే నిధులే ఇప్పుడు దిక్కయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను నమ్మే పరిస్థితి లేదన్నారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. బీజేపీ బలోపేతాన్ని చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు బదనాం చేసేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించటంతోపాటు తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారికి బుద్ధి చేపేందుకు త్వరలో ప్రజాచైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కంజర్ల ప్రకాశ్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



గ్రామ సభలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

మహేశ్వరం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలూరులో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలనలో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. లబ్ధిదారుల జాబితాలో తమ పేరు రాలేదని ఆందోళన చెందకుండా గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అలివేలు, వ్యవసాయ విస్తరణ అధికారి అఫ్సియా భేగం తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలూరులో వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. అంతకు ముందు గ్రామ సభకు హాజరైన నాలుగు పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బ్రేక్‌ఫాస్ట్!

- అల్పాహారానికి మంగళం
- గత ఏడాది ఏప్రిల్ 24 వరకు కొనసాగిన పథకం
- ఏడాది గడవక ముందే నిలిచిపోయిన వైనం
- జిల్లాలోని 1,228 పాఠశాలల్లో బంద్
- పౌష్టికాహారానికి దూరంగా విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: సర్కారు బడుల్లో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహారం పథకం అటకెక్కింది. ఏడాది గడవకుండానే విద్యార్థులకు అందకుండా పోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, వారికి నాణ్యమైన పౌష్టికాహారం ఇవ్వాలనే ఉద్దేశంతో 2023 అక్టోబర్ 5న అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలోనే రావిర్యాల్ ప్రభుత్వ పాఠశాలలో ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. అప్పటి మంత్రులు, సబితారెడ్డి, హరీశ్‌రావు లాంఛనంగా ప్రారంభించారు.

2024 ఏప్రిల్ 24 వరకు అమలు

సీఎం అల్పాహార పథకం (బ్రేక్‌ఫాస్ట్) పేరుతో సర్కారు బడుల్లో ప్రారంభమైంది. ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు తరగతుల ప్రారంభం కంటే అరగంట ముందు టిఫిన్ అందించాలి. సాంబార్ ఇడ్లీ, పూరీ, ఆలూ కుర్మా, ఉప్మా, వెజిటెబుల్ పులావ్, ఉగ్గాని .. ఇలా రోజుకో అల్పాహారం వేడివేడిగా అందించారు. జిల్లాలో 1,228 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలల్లో 80,975 మంది విద్యార్థులు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కలిపి 98,355 మంది విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 1,79,330 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. గత సంవత్సరం ఏప్రిల్ 24 వరకు పథకం నిర్విఘ్నంగా కొనసాగింది. కొత్త ప్రభుత్వం రాగానే ఈ పథకానికి మంగళం పాడేసింది.

కొనసాగించాలంటున్న తల్లిదండ్రులు

పథకం అమలు చేసిన బడులకు నయా పైసా రాలేదని నిర్వాహకులు వాపోయారు. ఈ పథకం సక్రమంగా అమలు చేస్తే విద్యార్థులకు మేలు జరిగేది. జిల్లాలో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వలస కార్మికుల పిల్లలు అత్యధికంగా ఉంటారు. ముఖ్యంగా ఒడిశా, బీహార్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి వచ్చిన వారి పిల్లలు ప్రభుత్వ బడుల్లో చదువుతారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు సైతం ఎక్కువగా విద్యాభ్యాసం సాగిస్తుంటారు. అల్పాహారం పథకం నిలిచిపోవడంతో తమ పిల్లలకు ఇబ్బందిగా మారిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకాన్ని కొనసాగించాలని కోరుతున్నారు.



రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని ప్రారంభించిన అప్పటి మంత్రులు సబితారెడ్డి, హరీశ్‌రావు

“ చిన్నచూపు తగదు



ప్రభుత్వ బడుల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన వారి పిల్లలే ఎక్కువగా చదువుకుంటారు. అలాంటి పాఠశాలలపై సర్కార్ చిన్నచూపు తగదు. ఓ వైపు మధ్యాహ్నం భోజనానికి బిల్లులు ఇవ్వడం లేదు. మరోవైపు పిల్లలకు ఉపయోగపడే ఇలాంటి పథకాన్ని నిలిపివేయడం బాధాకరం.

– చెరుకూరి మంగ, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, పోల్కంపల్లి

అక్కసుతోనే ఆపేశారు



బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ ముందుచూపుతో అల్పాహారం పథకం తీసుకురావడం జరిగింది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించుకున్నాం. కొత్త ప్రభుత్వం రాగానే అక్కసుతో మంచి పథకానికి మంగళం పాడింది. దీంతో పేద పిల్లలు పౌష్టికాహారానికి దూరమయ్యారు.

– సబితారెడ్డి, ఎమ్మెల్యే, మహేశ్వరం

ప్రారంభమైన మల్టీలెవల్ పార్కింగ్ పనులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ఒకటో నంబర్ పార్కింగ్ లాట్‌లో మల్టీలెవల్ పార్కింగ్ సముదాయం పనులను గురువారం బల్దియా అధికారులు ప్రారంభించారు. రూ.2.50 కోట్ల వ్యయంతో పీపీపీ మోడల్‌లో నిర్మాణం జరగనుంది. సుమారు 60 కార్లు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా ఈ సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రతిపాదిత మల్టీలెవల్ పార్కింగ్ బిల్డింగ్‌లో కాఫీ షాపులు, రెస్టారెంట్ల ఏర్పాటుకు లీజుకు తీసుకున్న సంస్థకు అనుమతించారు. మల్టీలెవల్ పార్కింగ్‌లో గంటకు ఇంత చొప్పున పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నారు. మల్టీలెవల్ పార్కింగ్ సముదాయం నిర్మిస్తే కేబీఆర్ పార్కుతో పాటు దీనిని ఆనుకుని ఉన్న జీహెచ్ఎంసీ వాక్‌వేకు వచ్చే వాకర్లు, సందర్శకులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోనున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే సర్వేలు, సభలు

ఎమ్మెల్యే సబితా రెడ్డి



జిల్లెలగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే సర్వేలు, సభలు తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. కార్పొరేషన్‌లో రూ.4.42 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తామని ఓ వైపు మంత్రులు చెబుతుంటే అధికార పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం తాము చెప్పిన వారికే ఇస్తామనడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తుండడంతో గ్రామ సభలను నిర్బంధాల మధ్య నడుపుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని అన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో మీర్‌పేట, బడంగ్‌పేట, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలకు మంజూరు చేసిన కోట్లాది రూపాయలను నిలిపివేయడం రాజకీయం కాదా అని నిలదీశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్వేలు, సమావేశాలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎనుగుల అనిల్‌యాదవ్, మాదరి సురేఖ, బొక్క రాజేందర్‌రెడ్డి, గడ్డమీది రేఖ తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శనకు బీసీ సంఘాల మద్దతు


మాట్లాడుతున్న దరువు అంజన్న

బీసీ కవులు, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న

శంకర్‌పల్లి: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీం కోర్టు ఆదేశాలున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం బాధకరమని బీసీ కవులు, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న అన్నారు. గురువారం ఆయన శంకర్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దరువు అంజన్న మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెబుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'వేల గొంతులు–లక్ష డప్పులు' మహా ప్రదర్శనకు బీసీ సంఘాల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో కవి మోహన్ బైరాగి, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు లక్ష్మణ్, సంజీవ్, రాంచందర్, మారయ్య, ప్రవీణ్‌యాదవ్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే డిమాండ్ల సాధన


బీసీ సేన అప్పారెడ్డిగూడ అధ్యక్షుడిని సన్మానిస్తున్న బర్క కృష్ణ

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: రాజ్యాధికారంతోనే హక్కులు సాధించుకునేందుకు అవకాశం ఉంటుందని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో బీసీసేన సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ అధ్యక్షుడిగా పత్తి శేఖర్, ఉపాధ్యక్షుడిగా నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యదర్శిగా సాయి రాంగౌడ్, కోశాధికారిగా చంద్రశేఖర్, సలహాదారులుగా శ్రీనివాస్, సభ్యులుగా మహేష్, శ్రీశైలం, శివ, రమేష్, లింగం, మల్లేష్, శ్రీకాంత్, శశికుమార్, మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలన్నారు.

చెస్‌లో శివాంశిక సత్తా

అత్తాపూర్: అత్తాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న శివాంశిక చెస్‌లో సత్తాచాటుతోంది. ఏపీలోని పెద్దాపూర్‌లో జనవరి 17 నుంచి 21వ వరకు నిర్వహించిన అండర్–15 బాలిక నేషనల్ జాతీయ స్కూల్ చాంపియన్‌షిప్–2025లో తెలంగాణ నుంచి శివాంశిక పాల్గొంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, వెస్ట్ బెంగాల్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల నుంచి 2500 క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలో తనదైన శైలిలో ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ అంతర్జాతీయ చెస్ క్రీడారంగంలో ఉన్న చెస్ క్రీడాకారుల ప్రశంసలు, ప్రోత్సాహాన్ని అందుకుంటోంది. పేదరికంలో ఉన్న శివాంశికను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తే దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుంటుందని.. మంచి కోచ్‌ను ఏర్పాటుచేస్తే ఉన్నత స్థానాలను అధిరోహిస్తుందని మాస్త్రో చెస్ అకాడమీ అత్తాపూర్ ట్రైనర్ అమిత్ పాల్‌సింగ్ అన్నారు. ఈ సందర్భంగా శివాంశికను అభినందించారు. నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించి ట్రోఫీ, రూ.5 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. చెస్‌లో రాణిస్తున్న శివాంశిక తమ పాఠశాల విద్యార్థిని కావడం తమకు గర్వకారణంగా ఉందని రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) శంకర్‌రాథోడ్, అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు సాయిప్రసాద్, గాంగ్యానాయక్ తదితరులు అభినందించారు.


శంకర్‌పల్లి ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టం


వివేకానందనగర్ కాలనీలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు

శంకర్‌పల్లి.. అభివృద్ధి లోగిలి

ఎమ్మెల్యే సారథ్యంలో మున్సిపాలిటీలో ప్రగతి

- రూ.వంద కోట్ల నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు
- ఆదర్శ పురపాలికగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషి

శంకర్‌పల్లి: చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో ఏర్పడిన తొలి మున్సిపల్ అయినప్పటికీ అభివృద్ధిలో మాత్రం అందలమెక్కింది. మండల కేంద్రం నుంచి మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయితే ఎలాంటి అభివృద్ధి ఉంటుందనేది ఈ పురపాలికను చూస్తే అవగతమవుతోంది. గడిచిన ఐదేళ్లలో సుమారు వంద కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం గమనార్హం. మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి వ్యవస్థ, నీటి సరఫరా వ్యవస్థతో మున్సిపాలిటీ కళకళలాడుతోంది. రేపటితో (జనవరి 25) మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియనుండడంతో 'సాక్షి' ప్రత్యేక కథనం

ఏడాదిన్నర తర్వాత పాలవర్గం

2018 ఆగస్టులో శంకర్‌పల్లి, బుల్కాపూర్, ఫత్తేపూర్, రామంతాపూర్, సింగాపూర్‌తో పాటు మరో నాలుగు గ్రామాలను కలుపుతూ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం శంకర్‌పల్లి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 21వేల జనాభా ఉండగా.. 15వార్డులుగా విభజించారు. మున్సిపల్ ఏర్పడినప్పటికీ ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గం ఏర్పాటుకు మాత్రం ఏడాదిన్నర సమయం పట్టింది. 2020 జనవరి 25న తొలి పాలకవర్గం ఏర్పడగా.. చైర్‌పర్సన్‌గా అప్పటి బీఆర్‌ఎస్ అభ్యర్థి సాత విజయలక్ష్మిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య(ఫైల్)

ఎమ్మెల్యే చొరవతో ప్రత్యేక నిధులు

నియోజకవర్గంలోని ఏకైక మున్సిపాలిటీ కావడంతో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యేకున్న సాన్నిహిత్యంతో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేశారు. గతంలో మున్సిపాలిటీకి వచ్చే ప్రధాన రహదారులు, కాలనీల్లోని సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి వ్యవస్థ, పారిశుద్ధ్యం గందరగోళంగా ఉండగా.. ప్రస్తుతం ఒకదారిలోకి తీసుకొని వచ్చారు. అంతిమయాత్రకు వైకుంఠ రథం, నిత్యం చెత్త సేకరణకు అవసరమైన రెండు ఆటోలను కొనుగోలు చేశారు.

మంజూరైన నిధుల వివరాలు

14, 15 ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి నిధులు	రూ.15.50 కోట్లు
స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్	రూ.87.50 లక్షలు
ఎల్‌ఆర్‌ఎస్ నిధులు	రూ.30.80 లక్షలు
రాష్ట్ర నిధులు	రూ.3 కోట్లు
టీయూఎఫ్‌ఐడీసీ	రూ.37.58 కోట్లు
రూర్బన్ నిధులు	రూ.83 లక్షలు
హెచ్‌ఎండీఏ	రూ.ఒక కోటి
ఎంపీ ల్యాడ్స్	రూ.55.60 లక్షలు
అమృత్ 2.0	రూ.32.47 కోట్లు

పచ్చని 'వెలుగులు'

హరితహారం, పట్టణ ప్రకృతి వనం పేరిట మున్సిపాలిటీలో పచ్చదనం పెంపునకు పెద్దపీట వేశారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. వారాంతాల్లో పిల్లలు ఆడుకునేందుకు, వృద్ధులు సేదతీరడానికి పట్టణంలోని వివేకానందనగర్ కాలనీలో చిల్డ్రన్స్ పార్కుతో పాటు, మహిళలు, పిల్లలు వ్యాయామం చేసేందుకు గాను ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. బుల్కాపూర్ శివారు నుంచి శంకర్‌పల్లి పట్టణ చౌరస్తా వరకు నాలుగు వరుసల రహదారిపై డివైడర్‌ని ఏర్పాటు చేసి, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు.

అభివృద్ధికి నిరంతరం కృషి

మున్సిపాలిటీని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేశాం. ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో సుమారు రూ.వంద కోట్ల అభివృద్ధి పనులు చేయించుకున్నాం. ఐదేళ్లలో ప్రజలకు దగ్గరవుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశాను.

– సాత విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, శంకర్‌పల్లి

వ్యసనాలకు బానిసలవ్వొద్దు

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శ్రీదేవి


మాట్లాడుతున్న శ్రీదేవి

మంచాల: యువత వ్యసనాలకు బానిసలవ్వొద్దని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి పొన్న శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని నోముల సమీపంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్ ఉచ్చులో చిక్కుంటే జీవితం అంధకారమవుతుందన్నారు. చిన్న వయస్సుల్లో యువత డ్రగ్స్ కేసులో జైలు జీవితం గడిపడం బాధాకరమన్నారు. కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కళాశాల నుంచి బహిష్కరణ చేయడమే కాకుంగా రెండేళ్ల జైలు శిక్ష, రూ.పదివేలు జరిమానా విధిస్తామన్నారు. ఈ సందర్భంగా లీగల్ సర్వీస్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సీహెచ్ రవి, ప్రిన్సిపాల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళను మోసం చేసిన వ్యక్తులకు రిమాండ్

కొత్తూరు: ఉద్దేశపూర్వకంగా ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిని కొత్తూరు పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌కు చెందిన ఎల్ల హంసమ్మ ఈ నెల 20న తన కోడలు రాధిక, మనుమడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణలో భాగంగా పోలీసులు ఆమె ఆచూకీ కోసం గాలిస్తుండగా ఈ నెల 22న రాధిక పోలీసుస్టేషన్‌కు చేరుకుని తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు వివరించింది. పెళ్లి సమయంలో తన తల్లిదండ్రులు ఎకరా పొలం ఇచ్చారు. గతేడాది ఆగస్టులో తన భర్త శ్రీకాంత్ డెంగీతో చనిపోయాడని.. ఈ క్రమంలో స్టేషన్ తిమ్మాపూర్‌కు చెందిన మహేందర్ శ్రీకాంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టిన పెట్టుబడిన వివరాలు చెబుతానంటూ నమ్మించి ఎకరా పొలానికి సంబంధించిన పట్టాపాస్‌బుక్ తీసుకున్నాడని చెప్పింది. ఈ నెల 20న మహేందర్ తన డ్రైవర్ శేఖర్‌తో కలిసి తిరుపతి తీసుకెళ్లి మార్గమధ్యలో దాడి చేసి బంగారు రింగ్, నగదు తీసుకుని బాండ్ పేపర్లపై సంతకం పెట్టాలని బలవంతం చేశారని వాపోయింది. తిరుపతి నుంచి తిరిగి హైదరాబాద్‌కు తీసుకువచ్చి సంతకం పెట్టాలని లేదంటే నిన్ను, కుమారుడిని చంపేస్తామని బెదిరించారని.. వారు మద్యం మత్తులో ఉండగా తప్పించుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చానని పోలీసులకు వివరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు మహేందర్, శేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక చాకు, కారు, రెండు సెల్‌ఫోన్లు, ఉంగరం కొంతనగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బందిని సీఐ అభినందించారు.

బైక్ ఢీకొని వాచ్‌మెన్ మృతి


ఘటనాస్థలిలో జంగయ్య మృతదేహం

యాచారం: బైక్‌ను వెనుక నుంచి మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో వాచ్‌మెన్ అక్కడికక్కడే మృతి చెందాడు. యాచారం సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన నక్కమల్ల జంగయ్య(52) తక్కళ్లపల్లి సమీపంలోని శ్రావణ పవర్‌ప్లాంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని గురువారం ఉదయం తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఆయన సాగర్‌రోడ్డుపైకి వచ్చిన వెంటనే వెనుకనుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనం జంగయ్య బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జంగయ్య తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఓ కూతురు ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షాపింగ్ మాల్ ఎదుట కార్మికుల ధర్నా


షాపింగ్ మాల్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

షాద్‌నగర్: షాపింగ్ మాల్‌లో పని చేసేందుకు వస్తున్న కార్మికుల వాహనాలకు భద్రత కల్పించాలని డిమాండ్‌తో గురువారం ధర్నా చేపట్టారు. చందన బ్రదర్స్ షాపింగ్‌మాల్ ఎదుట చేపట్టిన ఈ ధర్నాకు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు మాట్లాడుతూ.. చందన బ్రదర్స్ షాపింగ్‌మాల్‌లో పని చేస్తున్న ఇద్దరు కార్మికుల బైక్‌లు ఈ నెల 11న చోరీకి గురయ్యాయి. మాల్ యాజమాన్యం సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌ను పెట్టకపోవడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని.. చర్యలు తీసుకోవడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. సమస్యను పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

విద్యార్థి అదృశ్యం


భానుప్రసాద్ (ఫైల్)

యాచారం: గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. సీఐ కృష్ణం రాజు తెలిపిన ప్రకారం.. నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన గొరిగె భిక్షపతి, పార్వతమ్మ దంపతుల కుమారుడు భానుప్రసాద్ బొంగ్లూరు వద్ద ఉన్న నారాయణ హాస్టల్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు వచ్చిన విద్యార్థి గురువారం మధ్యాహ్నం ఫోన్ ఇంట్లోనే పెట్టి బైక్ తీసుకుని బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫోర్జరీ పత్రాలతో స్థలాల విక్రయం

నిందితుడి అరెస్ట్

రాజేంద్రనగర్: ఫోర్జరీ పత్రాలతో స్థలాలను విక్రయిస్తున్న వ్యక్తిని రాజేంద్రనగర్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. అతడిపై రాజేంద్రనగర్‌తో పాటు నార్సింగి, వరంగల్ ఠాణాల పరిధిలో రెండేసి, ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఒక కేసు ఉన్నట్లు తెలిపారు. ఎస్‌ఐ మామిడి కిశోర్ తెలిపిన ప్రకారం లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన చిట్టినిడి శేఖర్ బాబు రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పని చేసేవాడు. ఖాళీగా ఉన్న స్థలాలను చూసి వాటి నకలు డాక్యుమెంట్లను సంపాదించేవాడు. చిరునామా ఆధారంగా యజమానులు వివరాలు తెలియకపోయినా నకిలీ పత్రాలను సృష్టించి వాటిని జీపీఏ చేసుకుని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. జిల్లెలగూడ ప్రాంతానికి చెందిన చెన్నయ్యకు బండ్లగూడ మైలేల్ కాలనీలో సర్వే నంబర్ 50/2ఏ, 50/2బీలలో 288 గజాల స్థలం ఉంది. ఈ స్థలంపై కన్నేసిన శేఖర్ బాబు తన స్నేహితుడు పరమేశ్‌తో కలిసి నకిలీ పత్రాలను సృష్టించాడు. స్థలాన్ని కబ్జా చేసి విక్రయానికి సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలియడంతో చెన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శేఖర్ బాబును అరెస్ట్ చేసిన పోలీసులు పరమేశ్, వీరికి సహకరించిన మరో ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఐక్యతకు ప్రతీక ఉర్సు

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉర్సు ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నేరేళ్ల చెరువులోని దర్గా హజ్రత్ షా మూసా ఖాద్రీ ఉర్సు ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. అల్లా దయ అందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆయన కోరారు. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మానిక, హరికృష్ణ, పర్వేజ్ హుస్సేన్, అద్దు, సయ్యద్ అద్నాన్ ఎల్లయ్య, నర్సింలు, సయ్యద్ సాబేర్, సాజిద్, నజీర్, మన్సూర్, జావిద్, జిలానీ, సయ్యద్ ఉస్మాన్, శివాచారి, పవన్ ఠాకూర్, సుధీర్, మధు తదితరులు పాల్గొన్నారు.

'పశు సంక్రాంతి'కి సర్వం సిద్ధం

నేడు నార్సింగిలో పశువుల జాతర

- నిజాం కాలంలో మొదలైన పశువుల సంత
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- జాతరకు ఆవులు, గేదెలను తరలించిన రైతులు


పశు సంక్రాంతిలో అమ్మకానికి ఉంచిన గేదెలు



మణికొండ: హైదరాబాద్ నగర శివారు నార్సింగిలో ఏటా సందడిగా జరిగే పశుసంక్రాంతి జాతరను శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. నిజాం కాలంలో మొదలైన ఒరవడి నేటికీ నిరాటంకంగా కొనసాగుతున్నది. పంటలన్నీ ఇంటికి చేరి అవి అమ్మగా వచ్చిన డబ్బుతో రైతులు సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకొంటారని అందరికీ తెలుసు. మిగిలిన డబ్బుతో తమ పంటలకు తోడుగా పాడిని (పశువులు) కొనుగోలు చేసే సంస్కృతికి చిహ్నంగా నిలిచేదే నార్సింగి పశుసంక్రాంతి. ఒకప్పుడు నార్సింగి కుగ్రామంగా ఉన్న సమయంలో ప్రారంభమైన ఈ సంస్కృతి ప్రస్తుతం మున్సిపాలిటీగా అవతరించి ఎటు చూసినా ఆకాశాన్నంటే టవర్‌లు, అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కన్వెన్షన్‌లు, ఔటర్ రింగ్ రోడ్డుతో కొత్త హైటెక్ నగరంగా అవతరించినా కొనసాగుతుండటం అందరినీ అబ్బురపరుస్తుంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ తరువాత వచ్చే రెండవ శుక్రవారం పశు సంక్రాంతిగా నిర్వహిస్తారు.

- గుజరాత్, హరియాణా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది గేదెలు, ఆవులను వ్యాపారులు, రైతులు ఇక్కడకు తెచ్చి క్రయవిక్రయాలను నిర్వహిస్తుంటారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న పశు సంక్రాంతిని ఈ సంవత్సరం శుక్రవారం నిర్వహించేందుకు మార్కెట్ కమిటీ పాలక కమిటీ ఏర్పాట్లు చేసింది.
- ప్రతి సంవత్సరం నార్సింగి పశు సంక్రాంతికి వచ్చే గేదెలు, ఆవులు రికార్డు ధరలు పలికి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఈసారి పంటలు బాగా పండటం, వరి పంట అధిక దిగుబడి రావటంతో రైతుల వద్ద డబ్బు ఉందని, పంటలకు తోడుగా పశువులను పెంచుకోవాలనే దిశగా రైతులు ఆలోచన చేస్తున్నారని, దాంతో శుక్రవారం జరిగే సంతలో బారీగానే అమ్మకాలు జరిగే అవకాశం ఉంటుందని పశు వ్యాపారులు పేర్కొన్నారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్

ఏర్పాట్ల పరిశీలన

నార్సింగిలో పశుసంక్రాంతికి వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే వందలాది గేదెలు, ఆవులు తరలివచ్చాయి. మరిన్ని దారిలో ఉన్నాయని, శుక్రవారం ఉదయం వరకు అవి ఇక్కడకు చేరుకుంటాయని మార్కెట్ కమిటీ వర్గాలు పేర్కొన్నాయి. వాటిని అమ్ముకునేందుకు వీలుగా మార్కెట్ కమిటీ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దటంతో పాటు టెంట్‌లను ఏర్పాటు చేశారు. పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్ గురువారం పర్యవేక్షించారు. పశుసంక్రాంతికి వచ్చిన గేదెలు, ఆవులను పరిశీలించి వాటి విశిష్టతలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు.

- పశుసంక్రాంతిని శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, రైతులకు మొదటి సారి భోజనాలను ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా చైర్మన్ వెల్లడించారు.